పీయూ విద్యార్థులకు అభినందన

విజేతలుగా నిలిచిన పీయూ విద్యార్థులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన 'సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు' కార్యక్రమాల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన పీయూ విద్యార్థులను వీసీ శ్రీనివాస్ గురువారం అభినందించారు. పాలమూరు యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఎంఏ తెలుగు విద్యార్థులు కవి సమ్మేళనం, కోలాటం, జానపద పాటలు (బృంద గేయం), చిత్రలేఖనం కేటగిరీల్లో పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానాల్లో నిలిచినట్లు పీయూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్‌తోపాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఓఎస్డీటూ వీసీ మధుసూదన్ రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర కిరణ్, తెలుగుశాఖ అధ్యక్షుడు సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, రవీందర్‌గౌడ్, తిరుపతయ్య అభినందించారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని బోయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'బేటీ బచావో-బేటీ పడావో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల భద్రత, ఆరోగ్యం, సమాజంలో వారు ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కొవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నెం.1098కు ఫోన్ చేయడంతో పొందే సేవలు విశదీకరించారు. పీసీపీఎన్‌డీటీ భ్రూణహత్యల నివారణ చట్టంపై వివరించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారిణి జరీనాబేగం, డా.భాస్కర్‌నాయక్, జిల్లా మాస్‌మీడియా అధికారి మంజుల, కోఆర్డినేటర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జెడ్పీ ఎదుట ఆందోళన చేస్తున్న తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6: జిల్లాలో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని స్వీపర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జెడ్పీ సీఈవో కార్యాలయం ఎదుట తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు బాల గౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ.. 2024 జూలై నుంచి జనవరి 2025 వరకు వేతనాలు చెల్లించకుండా స్వీపర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలని ఎన్నో పోరాటాలు చేసినా.. పెరిగిన వేతనాల కోసం ఆరునెలల నుంచి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి ఫలితం లేకుండా పోతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా ఉన్న తాఖీదారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో జయమ్మ, చిన్నమ్మ, బాలనాగయ్య, శేఖర్, వెంకటయ్య, రామస్వామి, ఇస్తారయ్య, నర్సింహులు, భాస్కర్, శ్రీరాములు, రత్నమాల, అరుణమ్మ పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ఏవో జయసుధకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6: వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. తమ సమస్యలు విన్నవించేందుకు మంగళవారం మంత్రి పొంగులేటిని కలవడానికి వెళ్లిన వీఆర్ఏలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 లో వీఆర్ఏలు చేపట్టిన పోరాటం ఫలితంగా గత ప్రభుత్వం జీవో 81, 85ను విడుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏల్లో 16,758 మంది వీఆర్ఏలకు ప్రమోషన్ ఇచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. మిగిలి ఉన్న 3797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు గడుస్తున్నా, వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రజాప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్, అంజి, నవీన్, నరేందర్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

- పాలమూరు కలెక్టర్ విజయేందిరబోయి
- ఏర్పాట్ల పరిశీలన, అధికారులతో సమీక్ష

శ్రీనివాస అతిథి గృహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

పాలమూరు, ఫిబ్రవరి 6: మన్యం కొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను కలెక్టర్ విజయేందిరబోయి అదనపు ఎస్పీ రాములుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టం 12వ తేదీన రథోత్సవం, గరుడవాహన సేవ సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని.. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలీస్‌శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ తగినన్ని బస్సులు నడపాలని సూచించారు. అదేవిధంగా రథోత్సవ సందర్భంగా కొండపైకి ఫిట్‌నెస్ ఉన్న మినీ బస్సులు నిరంతరం నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ తరఫున కొండపైన, దిగువన అలివేలుమంగ ఆలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి డాక్టర్లు, మందులు ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌కో ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని జనరేటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ ద్వారా కొండపైన, దిగువన అవసర వైఖరి అగ్నిమానక సాధనాలతో సిద్ధంగా ఉండాలని, 5 కిలోమీటర్ల పరిధిలో మద్యపానాన్ని నిషేధించాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ ద్వారా అవసర వైఖరి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ భక్తులకు అవసర వైఖరి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండాలని చూడాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిను బండారాలు, ఆహార పదార్థాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేయాలని సూచించారు. ఇంటిగ్రేడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అన్నిశాఖల అధికారులు సిబ్బంది ఏర్పాటు చేసి మానిటర్ చేయాలని ఆదేశించారు. కోనేరు వద్ద బట్టలు మార్చుకు నేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ఈవోకు సూచించారు. కోనేరులో ఎప్పటికప్పుడు నీటిని శుభ్రం చేయాలని ప్రతిరోజూ నీటి సరఫరా చేయాలన్నారు. కొండపైన, కింద పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వేస్తున్నట్లు తెలిపారు. తప్పిపోయిన పిల్లలుంటే ప్రకటించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతమున్న 50 టాయిలెట్లకు బదులు పార్కింగ్, ఇతర ప్రదేశాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కొండపైన అతిథి గృహాలు, పార్కింగ్, కోనేరును పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, ఆయా శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్

వాహన తనిఖీలో పాల్గొన్న మహిళా ఎస్సై రేవతి

మక్తల్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

మక్తల్/కృష్ణ, ఫిబ్రవరి 6 : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిని సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్య లక్ష్మి రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ అభిషేక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జక్లేర్ చౌరస్తా నుంచి కాచ్‌వార్, మంతన్‌గౌడ్ క్రాస్ రోడ్డు, దండు క్రాస్ రోడ్డు, నల్ల జానమ్మ టెంపుల్, మక్తల్ బస్టాండ్, కనకాపర మేశ్వరి ఆలయం క్రాస్‌రోడ్, దాసరిదొడ్డి క్రాస్‌రోడ్ వరకు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంత ఏరియాను గుర్తించడం జరిగిందన్నారు. ఈ ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్‌ను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే మలుపుల వద్ద, గ్రామాల నుంచి ప్రధాన రహదారికి కలిసే చోట ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటిని నేషనల్ హైవే అథారిటీ గుర్తించి ద్వారా తగిన చర్యలు చేపట్టాల్సిందని సూచించారు.

పదోన్నతి బాధ్యతలు రెట్టింపు

నారాయణపేట, ఫిబ్రవరి 6: పదోన్నతి ఉత్సాహంతో పాటు బాధ్యతను పెంచుతుందని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచ్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న భువనయ్య ఎస్సైగా పదోన్నతి పొందారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్ను మర్యాదపూర్వకంగా కలవగా భువనయ్యకు టూ స్టార్స్ తొడిగి శుభాకాంక్షలు తెలియజేశారు. విధినిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత ఉత్సాహంగా పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నారాయణపేట, ఫిబ్రవరి 6: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మహిళా ఎస్సై రేవతి అన్నారు. గురువారం పట్టణంలోని పలు చోట్ల పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనాల తనిఖీలో 36 ఈ చలాన్‌లకు రూ.12,560 జరిమానా విధించడం జరిగిందన్నారు. 5 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని, పెండింగ్‌లో ఉన్న 61 ఈ చలాన్‌లకు రూ.24,100 జరిమానా కట్టించినట్లు పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : ఎంబీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీఏ కోసీ, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్తంగా నిర్వహించే ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిప్లొమా చేసి 18-30ఏండ్లలోపు మహిళలు అర్హులన్నారు. నెలకు వేతనం రూ.15,171లు ఉంటుందని అర్హులైన వారు శనివారం కళాశాలలో నిర్వహించే మేళాకు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు..

మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్

ఊట్కూర్, ఫిబ్రవరి 6 : మహిళలు స్వశక్తితో ముందడుగు వేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ తోడ్పాటునందిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దజట్రం రైతు వేదికలో షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నాక్ డైరెక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ దేశంలో అనేక సంస్థలు నాక్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుని ఉద్యోగాలు పొందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, డీపీఆర్‌వో రషీద్, ప్రత్యేక అధికారి పాల్గొన్నారు.

జీవో 11తో పాలమూరుకు నష్టం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మరికల్, ఫిబ్రవరి 6: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల ఎత్తిపోతల నుంచి డిండికి నీటి తరలించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 11ను వెంటనే రద్దుచేయాలని, జీవో 11తో పాలమూరు జిల్లాకు అన్యాయం జరుగుతుందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘువాచారి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని యువక మండలి భవనంలో జీవో 11 రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పాలమూరు ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరుగుతున్నా.. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఎందుకు చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. జిల్లాకు అన్యాయం జరుగుతుంటే ఎమ్మెల్యేలకు పట్టాదా అని ప్రశ్నించారు. చెంతనే కృష్ణమ్మ ఉన్నా పాలమూరు జిల్లాలో వలసల నివారణ చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, పాలమూరు-రంగారెడ్డి ద్వారా కోయిల్‌సాగర్, భీమా పేజ్-1కు పూర్తిస్థాయి నీటిని అందిస్తే ఈ ప్రాంత ప్రజలు వలసలు వెళ్లే పరిస్థితి రాదన్నారు. కోయిల్ సాగర్, భీమా ప్రాజెక్టుల కింద ఉన్న కాల్వలు, తూంల మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాకు రావాల్సిన నీటివాటాపై ఎమ్మెల్యేలు, మంత్రులపై రైతులు, ప్రజలు ఒత్తిడి చేయాలన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక నారాయణపేట జిల్లా కన్వీనర్ వెంకట్రాములు, సుదర్శన్, తిమ్మప్ప, చంద్ర శేఖర్, చక్రవర్తి, ఖలీల్, శ్రీదేవితోపాటు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

సింథటిక్ కెమికల్స్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరికల్, ఫిబ్రవరి 6: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీలో సింథటిక్ కెమికల్స్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులు తీసుకుంటున్నారని, వెంటనే ఈ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ చిత్త నూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గురువారం మండల కేంద్రంలో తాసీల్దార్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇథనాల్ కంపెనీతో ఇప్పటికే 23 గ్రామాల ప్రజలకు దుర్వాసన వస్తుందని, సింథటిక్ కంపెనీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పూర్తిగా విషపూరితంగా మారి వన్యప్రాణులు, మనిషి జీవిత మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాఘువాచారి, సుదర్శన్, వెంకట్రాములు, చక్రవర్తి, సుమతి, చంద్ర శేఖర్, సరోజ, తిమ్మన్న పాల్గొన్నారు.

పాలం తగాదాలో వ్యక్తి మృతి

భూత్పూర్, ఫిబ్రవరి 6: పట్టణ పరిధిలోని గోప్లాపూర్‌లో దాయాదులైన పోతురాజు కాశన్న(81), పోతురాజు రాములు సోమవారం రాత్రి భూ తగాదాలో గొడవపడ్డారు. గొడవలో పోతురాజు కాశన్న తలకు బలమైన గాయమైది. దీంతో పోతురాజు కాశన్నను జిల్లా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. గాయపడ్డ కాశన్న గురువారం మృతిచెందాడు. మృతుడు పోతురాజు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చంద్ర శేఖర్ తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు

కృష్ణ, ఫిబ్రవరి 6 : లారీ ఢీకొనడంతో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గుడెబల్లూరులో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెవి టోళ్ల రాఘవేంద్ర సైకిల్‌పై గ్రామం నుంచి తన పొలానికి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాయిచూర్‌లోని రిమ్స్ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దామరగిద్ద, ఫిబ్రవరి 6: మండలంలోని సజ్జనా పుల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తాసీల్దార్ దయాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం పిల్లల కోసం ఉంచిన బియ్యాన్ని పరిశీలించారు.

వాలీబాల్ విజేత మదనాపూర్ జట్టు



వాలీబాల్ విజేతకు షీల్డ్ అందజేస్తున్న గ్రామపెద్దలు

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 6: మండలంలోని రాచాలలో చెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేతగా వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని మదనాపూర్ జట్టు నిలిచింది. పోటాటీగా సాగిన పోటీల్లో కానాయిపల్లి, మదనాపుల్ జట్లు తలబడ్డాయి. విజేత అయిన మదనాపూర్ జట్టుకు రూ.20 వేలు నగదు, రన్నరప్ కానాయిపల్లి జట్టుకు రూ.10 వేలు నగదు తోపాటు, షీల్డ్, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గౌని చిన్నారెడ్డి, తిరుపతయ్యయాదవ్, రవీందర్ రెడ్డి, సుచేతన్‌రెడ్డి, రాము, శశివర్ధన్ రెడ్డి, అంజి, గోపి, రవికుమార్ గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి

బోర్ డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న జీఎం

ధన్వాడ, ఫిబ్రవరి 6: దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు కేటాయించిన 150ఎకరాల్లోని 50ఎకరాల రైతులకు ఉచితంగా బోర్ డ్రిల్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇద్దరు రైతులకు ఒక బోరు చొప్పున మొత్తం 23బోర్లను డ్రిల్లింగ్ చేయించారు. గత ప్రభుత్వం రూ.19లక్షలు మంజూరు చేయగా.. ఆ నిధులతో బోర్లను వేయించినట్లు పేర్కొన్నారు. నీరు పుష్కలంగా వస్తే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి మోటర్లను బిగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈడీ అబ్దుల్ ఖలీల్, రమాదేవి, అశోక్ బాబు, నరేశ్, ప్రదీప్, బాలరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ

మాగనూరు ఫిబ్రవరి 6 : పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మాగనూరు, కృష్ణ కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు గురువారం కెరీర్ గైడెన్స్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంవో విద్యాసాగర్, మాగనూరు, కృష్ణ స్పెషల్ ఆఫీసర్లు రాధిక, షాలిని తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక హతం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 6: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కర్ని నరేశ్ మేకపై చిరుత దాడి చేసి హతమార్చింది. బాధిత రైతు కథనం ప్రకారం.. కొండాపూర్ శివారులోని తన వ్యవసాయ పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటకు కాపలా కాసేందుకు నరేశ్ పొలం వద్దకు వెళ్లాడు. కాగా పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న గుడిసెలో రోజూ నిద్రించేవాడు. అతడితోపాటు రోజూ తన మేకను గుడిసెలోనే కట్టేసి నిద్రకు ఉపక్రమించేవాడు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి కూడా నరేశ్ మేకను గుడిసెలోనే కట్టేసి పక్కనే రైతు కూడా నిద్రపోయారు. రాత్రి 11గంటల సమయంలో చిరుత గుడిసె వద్దకు వచ్చి ఒక్కసారిగా మేకపై దాడి చేసి సుమారుగా 200మీటర్ల దూరం లాక్కెళ్లి గొంతు కొరికి హతమార్చినట్లు తెలిపారు. రైతు నరేశ్ తేరుకొని చుట్టుపక్కల రైతులను పిలిచి చూసే సరికి.. చిరుత మేకను చంపి రక్తం తాగి మృతదేహాన్ని వదిలేసి వెళ్లినట్లు తెలిపారు. మేకపై చిరుత దాడి చేసి హతమార్చిన ఘటనపై కొండాపూర్ గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

బీసీలపై చిన్నచూపు తగదు

ధన్వాడ, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు శ్రీనివాసులు, వెంకట్రాములు, అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు గుణపాఠం చెబుతారన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

మిడ్జిల్, ఫిబ్రవరి 6: మండలంలోని రెయిన్‌బో వెంచర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని మాజీ ఎంపీపీ సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు తాసీల్దార్ రాజుకు ఫిర్యాదు చేశారు. గురువారం మండల కేంద్రంలో తాసీల్దార్‌ను కలిసి రెయిన్‌బో వెంచర్ సర్వే నెంబర్ 217లో ఎలాంటి లావాదేవీలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రవీంద్ర, వరుణ్‌రాజు, రవి, సురేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయడమేమనగా నా క్లయింటు ఆగు మహ్మద్ ఖాజ తండ్రి షేక్ బాలేసాబ్, వయస్సు : 48సం॥ వృత్తి : వ్యవసాయం, నివాసము :కోస్గి టౌన్ మరియు మండలం, నారాయణపేట జిల్లా గారు ఈ క్రింద తెలుపబడిన కోస్గి టౌన్‌లో గల KGN కాంప్లెక్స్ షాప్ ఇట్టి డాక్యుమెంట్ నెంబర్ 446/1985 పైనా క్లయింట్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉమ్మడి భాగస్వామ్యం కలదు.

వారి పేర్లు :
1. యం.డి. అబ్దుల్ రాఫూఫ్ తండ్రి బాలేసాబ్
2. యం.డి. అమీర్ తండ్రి బాలేసాబ్
3. మహ్మద్ ఇబ్రహీం తండ్రి అబ్దుల్ ఆఫీజ్
4. హీనా భర్త నెమతుల్లా

వీరందరి నివాసం కోస్గి టౌన్ మరియు మండల్, వీరందరు తేది.18.01.2025 నాడు రాజీపత్రం కుదుర్చుకున్నారు. కాపున ఇట్టి KGN కాంప్లెక్స్ షాట్ ఇట్టి డాక్యుమెంట్ నెంబర్ 446/1985 కోస్గి టౌన్‌లో గల KGN కాంప్లెక్స్ షాట్ ఇట్టి డాక్యుమెంట్ నెంబరు. 446/1985, వీరందరు పెద్దల సమక్షంలో భాగపరిష్కారం కొరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే నా క్లయింట్‌కు భాగపరిష్కారం కానందువలన ఇట్టి KGN కాంప్లెక్స్ షాట్ పై క్రయావిక్రయాలు మరియు ఎలాంటి ఒప్పందాలు జరపరాదని తెలియజేస్తున్నా